


నమస్కారం స్వామి.

"దేవునికి నాయనా నమస్కారం నాక్కాదు."

"ఇదుగోండి స్వామి."

"ఏమిటి నాయనా తెచ్చావ్?"

"ఏవోలెండి. పళ్ళు-పూలు, కానుకలు."

"ఇదుగో అమ్మా పూలు-బాబు ఇవిగో పళ్ళు-శిష్యా! ఆ దక్షిణ తీసుకో."

"చిత్తం స్వామి."

"స్వామి! అజ్ఞానులమైన మాకేదైనా సెలవివ్వండి"

"నాయనా! ఈ కనపడే సకల చరాచరములన్నీ మాయ పరబ్రహ్మ ఒక్కటే సత్యం."

"అంటే తమరికి నేను పళ్ళు ఇచ్చింది మాయనా స్వామి?"

"అవును నాయనా."

"పూలిచ్చింది మాయేనా?"

"అవును"

"116 రూపాయలిచ్చింది మాయేనా?"

"ఆహా!"

"అయితే పళ్ళు పూలు భక్తాదులకిచ్చి డబ్బుమాత్రం తమరే వుంచుకున్నారు. డబ్బుకూడా మాయ అయినప్పుడు దాన్ని ఇతర్లకివ్వలేదేం స్వామి? అహో నాకు తెలీక అడుగుతాను. డబ్బు మాయకాదా?"

.... .... ....

ఇక అందరూ పదండి స్వామివారు ధ్యాన సమాధిలోకి వెళ్ళిపోయారు. ★




"లక్ష్మీలక్ష్మీ" అంటూ బిగ్గరగా కేక వేశాడు రంగారావు.

"అబ్బబ్బ ఏమిటండీ ఆ కేకలు" అంటూ వంటింట్లోనుంచి గబగబా గదిలోనికి వచ్చింది లక్ష్మి. "టేబిల్ మీద పెట్టిన పర్సులో అయిదు రూపాయలు తక్కువైనాయి నువ్వు తీశావా?" కోపంగా అడిగాడు.

"నేనెందుకు తీస్తాను. నాకేం అవసరం ఉంది తీయటానికి" మూతి ముడుస్తూ అన్నది లక్ష్మి "మరింకెవరు తీశారు."

"ఉండండి రంగి వొద్దున్న చిమ్మటానికి గదిలోకి వచ్చింది. అప్పుడు గదిలో ఎవ్వరూ లేరు. మీరు స్నానం చేస్తున్నారు. నేను వంటపనిలో ఉన్నాను. దాని పనే అయ్యుంటుంది. పిలుస్తానుండండి" అంటూ "రంగీ, ఓ రంగీ" అంటూ కేకలు వేసింది. అంట్లు తోముతున్న రంగి హడావిడిగా పరిగెత్తుకొచ్చింది, "ఏంటమ్మగోరు" అంటూ.

"నిజం చెప్పవే అయ్యగారి పర్సులోంచి ఐదు రూపాయలు తీశావా లేదా?" ఎదురు చూడని ప్రశ్నకు నిర్ఘాంతపోయి ఒక్క క్షణం వరకు తేరుకోలేకపోయింది.

'అమ్మగోరూ ఏటండి మీరనేది? నానేమి ఎరగను అన్నది భయంగా, కంగారుగా.

"ఏమీ లేకుంటే ఎందుకు ఆ కంగారు? మర్యాదగా నిజంచెప్పు. లేకపోతే ఆ అయిదు రూపాయలు జీతంలో నుంచి తీసేస్తాను" బెదిరించింది. ఎంతకూ ఒప్పుకోలేదని జీతంలో నుంచి అయిదు రూపాయలు తీసేసి తన మాట నిలుపుకుంది. ఇది జరిగిన కొద్ది రోజులకు ఊడ్చటానికి గదిలో కెళ్ళిన రంగి మాటరాక అచేతనంగా నిలబడిపోయింది. కారణం భర్త పర్సులో నుంచి ఒకనోటు తీసికొని బొడ్లో దోపుకుంటూ లక్ష్మి కనిపించింది. ●







పెంచల్రెడ్డి ఆ వూరి మోతుబరి. కాస్త పిసినిగొట్టు. తన పొలాని క్కావలసిన పురుగు